# కాంగ్రెస్ వస్తే రైతులను ముంచుతది



ఎల్లాపూర్‌లో దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్

- రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోతది
- 3 గంటల కరెంట్ ఇస్తామన్న రేవంత్.. ఇప్పుడు 10హెచ్‌పీ మోటర్ అంటున్నడు
- ఏం మాట్లాడుతున్నడో ఆయనకే తెలువడం లేదు
- మన దగ్గర అట్లాంటి మోటర్లు పెట్టుకుంటరా..?
- ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- పెగడపల్లి మండలంలో ప్రజా ఆశీర్వాద యాత్ర

పెగడపల్లి, నవంబర్ 14: ''కాంగ్రెస్ పాలన మనకు కొత్తనా..? మన రాష్ట్రాన్ని ఏండ్ల కొద్ది పాలించింది మీరు చూడలేదా..? ప్రజలను గోస పెట్టింది. రైతులకు నరకం చూపింది. వాళ్ల పాలనలో కష్టాలు, కన్నీళ్లు తప్ప ఇంకేమైనా ఉన్నయా..? రైతులు బాగా ఆలోచన చేయాలి. మొన్నటిదాకా ఎవుసానికి 3 గంటల కరెంట్ చాలని అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు మళ్లీ పొలం కాడ 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నడు. మన దగ్గర అంత పెద్ద మోటర్లు వాడే రైతులు ఉన్నరా..? ఎందుకిట్ల ఆగం చేస్తున్నడో అర్థమైతలేదు.. నేనొక్కటే చెబుతున్నా.. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు మునుగుతరు. రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోతది''అని ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతున్నదని, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని చెప్పారు. మంగళవారం పెగడపల్లి మండలం రాజారాంపల్లి, కీచులాటపల్లి, ఎల్లాపూర్, రాంబద్రునిపల్లి, ఏడుమోటలపల్లి, తండ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొప్పులకు మహిళలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. బొట్టు పెట్టి మరీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. నాడు దగా పడ్డ తెలంగాణ, స్వరాష్ట్రంలోనే అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని, ముఖ్యంగా దేశానికి అన్నం పెట్టే రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. విద్య, వైద్య రంగం ప్రజలకు చేరువైందన్నారు. ఈ పదేండ్లలోనే ఇంత అభివృద్ధి జరిగితే.. పథకాల అములులో దేశంలో మనమే ముందున్నామని, సంపదను సృష్టించి పేద ప్రజలకు పంచి పెట్టడం సీఎం కేసీఆర్ విధానమని మంత్రి ఈశ్వర్ స్పష్టం చేశారు. స్వరాష్ట్రంలో తన పదేళ్ల పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో చేశానని, ప్రజలు మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఇక్కడ జడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభా-సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ లోక నిర్మల, సర్పంచులు సత్తమ్మ, స్వప్న, అంజమ్మ, రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీలు రవీందర్, అంజయ్య, విండో చైర్మన్ వేణుగోపాల్, పార్టీ మండల అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు ఆనందం, ఉప సర్పంచులు రాజశేఖర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్, కనకయ్య, విజయ్‌యాదవ్, కిరణ్, అజయ్, లక్ష్మణ్, రాజు, వినోద్, సంతోష్, హరిగోపాల్, రాజేశం, మల్లేశం, తిరుపతి, మమత, ఇందిర ఉన్నారు.

# ఆగంకావద్దు.. ఆలోచించండి



పైడిమడుగులో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- ప్రతిపక్షాలను నమ్మితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే
- పరాయి బిడ్డ కావాలా?.. మీ ఇంటి బిడ్డ కావాలా..?
- మీరే నిర్ణయం తీసుకోండి
- బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల
- జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుతో కలిసి కోరుట్ల మండలంలో ఎన్నికల ప్రచారం

కోరుట్ల రూరల్, నవంబర్ 14: ''ఎన్నికలు వచ్చినయి. ప్రచారంలో నాయకులు తిరిగేదే తిరుగుతున్నరు. వాళ్లు, వీళ్లు వచ్చి ఏదేదో చెబుతుంటరు. ఎన్ని మాయమాటలు చెప్పినా, అబద్ధాలు మాట్లాడినా ఆగంకావద్దు. ఏది మంచిది.. ఎవరితో మేలైతదో ఆలోచించి ఓటేయాలి. మంచి నిర్ణయం తీసుకోవాలి' అని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. 'ప్రతిపక్షాలను నమ్మితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో ఒరిగిందేమైనా ఉన్నదా..? ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు తప్ప జరిగిన మేలేమి లేదు. అలాంటి దరిద్రపు పాలన మళ్లీ కావాలా..?, లేదా తొమ్మిదేండ్లలోనే రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన బీఆర్ఎస్ పాలన కావాలా..? ప్రజలే ఆలోచించుకోవాలి' అని సూచించారు. మంగళవారం కోరుట్ల మండలం మాదాపూర్, పైడిమడుగు, జోగిన్‌పల్లి, మోహన్‌రావుపేట, గుమ్లాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ప్రచారం చేశారు. కాగా, ఆయా గ్రామాల్లో సంజయ్‌కు రైతులు, యువకులు, వృద్ధులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు మంగళహారతులు, డప్పుల చప్పుళ్లతో అపూర్వ స్వాగతం పలికారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో డా. సంజయ్ మాట్లాడారు. నాడు అధ్వానంగా ఉన్న తెలంగాణను స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి మహిళకు సౌభాగ్యలక్ష్మి కింద నెలకు రూ.3,016 చొప్పున పెన్షన్ అందిస్తామన్నారు. రాష్ట్రంలో తప్ప దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదని, ఇప్పుడు మళ్లీ పీఎఫ్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛన్ ఇస్తామని ప్రకటించి సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలిచారన్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.1,00,116 చొప్పున ఆర్థిక సహాయంతో ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 'ఎన్నికలు వచ్చాయని కొందరు పరాయి ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేస్తూ ఏవేవో కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఈ గడ్డ మీద పుట్టిన నేను కావాలా..? పరాయి బిడ్డ కావాలా..? ఆలోచించాలని' కోరారు. 'ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి. మీనమ్మకాన్ని వమ్ము చేయకుండా కోరుట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలెబడుతానని' విజ్ఞప్తి చేశారు. చదువుకున్న ఈ ప్రాంత యువత ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గంలోనే ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు దారిశెట్టి రాజేశ్, ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ సభ్యులు దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, రైతు బంధు సమితి జిల్లా సమన్వయ కర్త చీటి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌కాశిరెడ్డి మోహన్‌రెడ్డి,బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షులు నత్తి రాజ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్యాక్స్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

# ప్రజా సేవకే ఈ జీవితం

- మళ్లీ ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- గతంలో రైతు చనిపోతే రూపాయి ఇచ్చినోడు ఉన్నడా..
- కనీసం పంట పెట్టుబడులకైనా ఇచ్చిన్రా..
- ఆలోచించి ఓటేయండి
- జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్ కుమార్

సారంగాపూర్, నవంబర్14: 'ఎన్నో ప్రభుత్వాలు వచ్చినయి.. పోయినయి. ఎవరి పాలన ఎట్లా ఉండెనో మీ అందరికీ తెలుసు. ఒకప్పుడు తెలంగాణ ఎట్లుండె.. ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇప్పుడెట్ల మారిందో.. ఎంతలా అభివృద్ధి చెందిందో చూడండి. గతంలో పల్లెల్లో రైతు చనిపోతే రూపాయి ఇచ్చినోళ్లు ఉన్నరా..? రైతును కనీసం ఆదుకున్నోళ్లు ఉన్నరా.. పంట పెట్టుబడికి పైసలు ఇచ్చినోళ్లు ఉన్నరా.. ఎవ్వరూ ఇయ్యలే. పైగా రైతు జీవితాన్ని ఆగం చేసిన్రు. ఇంకా ముష్టి వేసినట్లు రూ.200 పింఛన్ ఇస్తుండె. అది ఎందుకైనా అక్కరకు వస్తుండెనా..?. కానీ స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలను బాగుచేసుకున్నమని జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 'రైతు బీమా కింద కుటుంబాలు ఆగం కాకుండా రూ.5లక్షల బీమా ఇస్తున్నం. పెట్టుబడుల బాధ లేకుంటా ఎకరానికి రూ.10వేల రైతు బంధు ఇస్తున్నం. రూ.200 పింఛన్ ఆసరా పింఛన్‌ను రూ.2016 చేసుకున్నం. నేనొక్కటే చెబుతున్న ప్రతిపక్షాలను నమ్మితే మోసపోతం. మళ్లీ పాత కథే అయితది. ఒకసారి మీరందరూ ఇంటికి వెళ్లిన తర్వాత బాగా ఆలోచించి ఓటు ఎవరికి వేయాలో నిర్ణయం తీసుకోండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పోతారం, బట్టపల్లి, సారంగాపూర్, నాయకపు గూడెం, మ్యాడారం తండా, భీంరెడ్డి గూడెం, రేచపల్లి, లచ్చునాయక్ తండా గ్రామాల్లో జగిత్యాల నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాజేశం గౌడ్, స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడారు. ప్రజా సేవనే తన జీవిత లక్ష్యమని, ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని చెప్పారు. 'నాడు కరెంట్ కోసం ఎంత ఇబ్బందులు పడ్డామో..? మీరు చూశారు. ఇచ్చే రెండు, మూడు గంటల కరెంటైనా సరిగ్గా లేక టాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండె. మోటర్లు కాలిపోతుండె. రిపేర్లు చేయించేందుకు ఎన్ని ఇబ్బందులు పడ్డమో..? మరిచిపోయారా..? ఇప్పుడు కాంగ్రెసోడు సాగుకు 3 గంటల కరెంటే ఇస్తా అంటున్నడు. మీ అవసరాలకు సరిపోతదా..? నేనొక్కటే అడుగుతున్నా..? సాగుకు 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? 3 గంటలే చాలు అంటున్న కాంగ్రెస్ కావాలో.. మీరే నిర్ణయం తీసుకోవాలని' సూచించారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో జగిత్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఎంతో మార్పులు వచ్చాయన్నారు. నిరంతర ఉచిత విద్యుత్, పంటల పెట్టుబడి సాయం వల్ల పంటల సాగు గణనీయంగా పెరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించినట్లు చెప్పారు. పాత బస్టాండ్‌లో పాత సర్కార్ దవాఖాన ఉందని, దానికి ఐదింతలు పెద్దది కొత్త బస్టాండ్ సమీపంలో కొత్త దావఖానను నిర్మించుకున్నామని చెప్పారు. ప్రతిపక్షాల చెప్పుడు మాటలు నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీకే వారంటీ లేదని, వాళ్లు ఇచ్చే హామీలకు గ్యారంటీ ఉంటుందా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సంచనలమని, రైతు బీమా తరహా కేసీఆర్ బీమాతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఇంకా సౌభాగ్య లక్ష్మి పథకం కింద ప్రతి పేద మహిళలకు నెలకు రూ.3వేల భృతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంకా కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన సిలిండర్‌ను రూ.400కే అందిస్తామని వివరించారు. ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, జగిత్యాల ఎన్నికల ఇన్‌ఛార్జి రాజేశం గౌడ్ ప్రజలను కోరారు. కాగా, ప్రచారం సందర్భంగా సంజయ్‌కుమార్‌కు ఆయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, వైస్ఎంపీపీ సొల్లు సురేందర్, ప్రజాప్రతినిధులు ఢిల్లీ రామారావు, అర్రె లక్ష్మి, జోగినిపెల్లి సుధాకర్ రావు, కొత్తురి రాజేశ్వరి, భుక్య అరుణ్ కుమార్, బుచ్చిమల్లు, ఎడమల జయ, భుక్య లావణ్య రాథోడ్, అజ్మీర శ్రీలత, పార్టీ అధ్యక్షులు గుర్రాల రాజేంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్ గౌడ్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మదన్ కుమార్, జాగృతి మండలాధ్యక్షుడు మహేశ్ ఉన్నారు.

# భారీ మెజార్టీతో గెలిపించాలి

జగిత్యాల రూరల్, నవంబర్ 14: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సతీమణి రాధిక అన్నారు. మంగళవారం పొలాస, తాటిపల్లి గ్రామాల్లో వారు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సంజయ్ కుమార్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటెయ్యాలని విన్నవించారు. అనంతరం తాటిపల్లి గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, రూరల్, అర్బన్ మండలాల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, సురేందర్ రావు, ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు, సర్పంచ్ నరేశ్, మోతె గ్రామ సర్పంచ్ స్వప్న రాజేశ్వర్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జావిద్, గ్రామశాఖ అధ్యక్షుడు రాంశంకర్, ఏఎంసీ డైరెక్టర్ సురేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.